ప్రణాళిక అమలులో అవరోధాలు...

మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ప్రణాళికాబద్ధ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తుంది. అన్ని దేశాలకు కొన్ని ఆర్థిక -సాంఘిక లక్ష్యాలను సాధించడానికి ప్రణాళికలు అవసరమవుతాయి. ఈ లక్ష్యాలను సాధించే దిశలో ప్రభుత్వ రంగానికి మార్గనిర్దేశం చేయడానికి ఒక ఆర్థిక ప్రణాళిక ఉండాలి. అదే సమయంలో అసంఘటిత రంగంలో ప్రైవేటు రంగ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురి కారాదు. ఆర్థికాభివృద్ధిలో ప్రైవేటు రంగం ప్రధానపాత్ర పోషించేవిధంగా ప్రభుత్వం 'సంఘటిత ఆర్థిక ప్రణాళిక' రూపొందించుకోవాలి. అనేక రాయితీలు, ప్రోత్సాహకాల ద్వారా ప్రభుత్వం ప్రైవేటు రంగానికి మార్గనిర్దేశనం చేస్తూ మరోవైపు నియంత్రణ చర్యలు చేపడుతుంది. మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రణాళిక ప్రక్రియ చాలా క్లిష్టతరమైంది. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ప్రణాళికల విజయం... ప్రభుత్వరంగం సాంఘిక లక్ష్యాలను సాధించడానికి ఏ మేరకు కృషిచేస్తుంది, ప్రైవేటు రంగాన్ని సాంఘిక లక్ష్యాల సాధనకు కృషిచేసే దిశగా మరల్చడంలో ఎంతవరకు సఫలీకృతమైంది, పెట్టుబడి నిర్ణయాలకు సంబంధించి ఏర్పడే అవరోధాలను ఏ మేరకు నియంత్రించగలిగింది అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్పత్తి, వాణిజ్యం, ఫైనాన్స్‌కు సంబంధించి ప్రణాళిక యుగంలో అనేక ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేశాయి. విజయ వంతంగా నడుస్తున్న కొన్ని ప్రైవేటురంగ యూనిట్లను జాతీయం చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీలు, బ్యాంకులను కేంద్ర ప్రభుత్వం; రోడ్డు రవాణా సంస్థలను రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయం చేశాయి. కొన్ని ఖాయిలాపడ్డ టెక్స్‌టైల్ మిల్స్, ఇంజినీరింగ్ యూనిట్లను కూడా ప్రభుత్వం జాతీయం చేసింది. చాలా రాష్ట్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వరంగ సంస్థల్లో జవాబుదారీతనం లోపించడం, పర్యవేక్షణ లోపం, అవస్థాపితా సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేక పోయినందువల్ల అవినీతి, అసమర్థత పెరిగి, నష్టాల్లోకి కూరుకుపోయాయి.

సోవియట్ యూనియన్, తూర్పు యూరోప్‌లోని కమ్యూనిస్ట్ దేశాల్లో కూడా ప్రభుత్వరంగ సంస్థలు వనరుల సద్వినియోగంలో విఫలమై, సాధారణ ప్రజల నుంచి కూడా విమర్శలకు గురయ్యాయి. అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల కృషి వల్ల ప్రైవేటు రంగ అభివృద్ధికి ప్రణాళిక ప్రాధాన్యతల్లో అనేక మినహాయింపులు చోటుచేసుకున్నాయి. దత్ కమిటీ అభిప్రాయంలో పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వ రంగానికి రిజర్వ్ చేసిన ప్రాంతాల్లో ప్రైవేటు రంగాన్ని అనుమతించారు. ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ప్రభుత్వరంగ పాత్ర కుదించారు. 1991 వరకు తప్పనిసరిగా లైసెన్స్ కావలసిన పరిశ్రమల సంఖ్య 1750 ఉండగా ప్రస్తుతం వాటిని 5కు కుదించారు. విదేశీ పెట్టుబడులు, విదేశీ సాంకేతిక పరిజ్ఞానంపై ఉన్న ఆంక్షలు తొలగించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రైవేటీకరణ ప్రాధాన్యతను తెలుపుతుంది.

ప్రణాళిక ప్రక్రియలో అవరోధాలకు కారణాలు

ప్రైవేటు రంగ అభివృద్ధి కోసం అనేక పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం దిగుమతికి చర్యలు తీసుకొన్నందువల్ల అధిక లాభాలతో ప్రైవేటు రంగం ఒకవైపు, అసమర్థతతో కూడుకొన్న ప్రభుత్వ రంగం మరోవైపు ఉండటం ప్రణాళిక ప్రక్రియలో అనేక అవరోధాల ఏర్పాటుకు కారణమైంది.

- ఆదాయ, సంపదలోని వ్యత్యాసాల వల్ల మొత్తం ఉత్పత్తి నిర్మాణ తలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. జాతీయ వనరుల్లో ఎక్కువ భాగం ధనికుల అవసరాలు తీర్చడానికి ఉపయోగించారు.
- ప్రణాళిక యుగంలో ఉపాధి వృద్ధి తగ్గింది. ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ముఖ్యంగా గ్రామీణ ఉద్యోగితా వృద్ధి తగ్గింది. అధిక జనాభా నియంత్రణలో ప్రభుత్వం విఫలం కావడం, మూలధన సాంద్రత ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల నిరుద్యోగ సమస్య పెరిగింది.
- పన్ను ఎగవేత, నల్లధనం పెరిగి పురోగామి పన్ను విధానానికి విఘాతం ఏర్పడింది.
- ఆదాయ పునఃపంపిణీ శ్రామిక వర్గానికి అనుకూలంగా జరగడంలో వైఫల్యం ఏర్పడింది. జాతీయ ఉత్పత్తి పెరిగినప్పటికీ శ్రామిక వర్గాల వాస్తవ వేతనాల్లో పెరుగుదల లేదు.
- పెట్టుబడి ప్రభుత్వ లేదా ప్రైవేటు రంగంలో దేనిలో జరిగినప్పటికీ వృద్ధి ప్రతిఫలాలు ఎక్కువగా పెద్ద వ్యాపార సంస్థలు, పెద్ద వ్యాపారులు, భూ స్వాములకే లభించాయి.
- సంస్కరణల నేపథ్యంలో ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణకు సంబంధించిన అభివృద్ధి నమూనా స్థూల దేశీయోత్పత్తిలో 10 శాతానికే పరిమితమైన కార్పొరేట్ రంగంపై కేంద్రీకృతమైంది.
- అధిక ఉపాధిని అందించే వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల పెరుగుదలకు అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పన జరగలేదు.
- వినియోగ వస్తురంగంలో బహుళజాతి సంస్థలను అనుమతిస్తున్నందువల్ల చిన్న, మధ్యతరహా సంస్థలు తీవ్ర పోటీ ఎదుర్కొ

న్నాయి. ప్రణాళిక యుగంలో ఈ సంస్థల ఆధునికీకరణకు సంబంధించి ప్రోత్సాహక విధానాలు రూపొందలేదు.

- దిగుమతులపై ఉన్న ఆంక్షలు తొలగించడం ద్వారా భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో దిగుమతులు పెరిగి, వాణిజ్య లోటు అధికమవుతోంది.
- ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి ధ్యేయంగా ప్రణాళికా రచన జరిపినప్పటికీ ఇప్పటికీ వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కొరతగా ఉన్నందువల్ల పారిశ్రామికీకరణ ఆయా ప్రాంతాల్లో జరగలేదు.
- ఆర్థికాభివృద్ధిలో ప్రధానపాత్ర వహించే మానవాభివృద్ధి జరగాలంటే విద్య, ఆరోగ్య రంగాలపై పెట్టుబడులు పెరగాల్సి ఉండగా వీటిపై ప్రభుత్వ వ్యయాలు తక్కువగా ఉన్నాయి. ప్రాథమిక విద్యాస్థాయిలో డ్రాప్‌అవుట్ రేటు ఎక్కువగా ఉండటం, ఉన్నత విద్య ఎన్‌రోల్‌మెంట్ వృద్ధి 7 నుంచి 8 శాతంగా మాత్రమే ఉండటం భవిష్యత్తులో ఆర్థికాభివృద్ధి ఆటంకం కాగలదు. విధాన నిర్ణేతలు ఎక్కువగా ఉపయోగించుకొనే కార్పొరేటు ఆసుపత్రులకు ప్రాధాన్యం పెరిగి, ప్రభుత్వ వైద్యరంగం కుంటుపడింది. ప్రైవేటు ఆసుపత్రుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తున్నప్పటికీ పేదప్రజల ఆరోగ్య అవసరాలు తీర్చడంలో అవి విఫలమయ్యాయి.
- కొలు సంస్కరణలు సక్రమంగా అమలు చేయకపోవడం, భూస్వాముల నుంచి అధిక భూములను తీసుకొని, భూమిలేని రైతులకు తిరిగి పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందినందు వల్ల ప్రణాళికల లక్ష్యమైన సాంఘిక న్యాయం, సమానత్వం అనే సూత్రానికి విఘాతం ఏర్పడింది.
- ప్రపంచీకరణ నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలతో పాటు ఉపాధి వృద్ధి జరుగుతుందని ప్రణాళికా రచయితలు భావించారు. కానీ సరైన 'ఉద్యోగితా వృద్ధి వ్యూహాన్ని' అవలంభించలేకపోయారు.

ప్రణాళికల వైఫల్యం-ఆర్థికవేత్తల అభిప్రాయాలు

స్వాతంత్ర్యానికి ముందు వలస ఆర్థిక వ్యవస్థగా ఉండి, స్వాతంత్ర్యానంతరం సామ్యవాద భావనతో పురోగామి దిశకు పయనింపజేయటంలో ప్రణాళికల పాత్ర ఎంతో ఉందని చెప్పవచ్చు. ఆర్థిక వ్యవస్థలో ఆధునికీకరణ చోటుచేసుకొని కొన్ని రంగాల్లో స్వయంసమృద్ధి సాధ్యమైంది. ప్రణాళికలు ప్రారంభమైన తర్వాత మొదటి 40 సంవత్సరాల కాలంలో ప్రణాళికల విజయాలను పరిశీలించిన డి.టి. లక్డావాలా అభిప్రాయంలో ''అనేక రంగాల్లో భారతదేశం సాధించిన ప్రగతి సంతృప్తికరంగా ఉంది. పొదుపు, పెట్టుబడి రేట్లు పెరుగుదలతో పాటు, ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి, పారిశ్రామిక నిర్మాణతలో మార్పు, బ్యాంకింగ్ సౌకర్యాలు లేని ప్రాంతాలకు బ్యాంకుల విస్తరణ, మార్కెటింగ్‌లో సహకార వ్యవస్థ వృద్ధి జరిగింది. ఆయుఃప్రమాణం, మరణరేటు, శిశుమరణాల రేటుకు సంబంధించి స్వాగతించదగ్గ మార్పులు చోటుచేసుకున్నాయి.'' ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా ప్రణాళికలు రూపకల్పన చేసినప్పటికీ వాటికి అవసరమైన వనరుల సేకరణలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ప్రణాళికలు నిర్దేశించిన సాంఘిక-ఆర్థిక లక్ష్యాలు సాధించలేకపోవడానికి ప్రభుత్వరంగ సంస్థల ఉత్పత్తిలోని అసమర్థత కారణమని ఎస్.చక్రవర్తి అభిప్రాయపడ్డారు. ఉత్పత్తి గణనీయంగా పెరిగినప్పటికీ శక్తి, రవాణా, స్టీలు, ఎరువుల ఉత్పత్తుల్లో లోపాలున్నాయని, వృత్తుల వారీ శ్రామిక పంపిణీలో ఎటువంటి మార్పులు చోటుచేసుకోలేదని ఆయన అభిప్రాయపడ్డారు. ''వేతన-వస్తు నమూనా ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రయత్నించకుండా విధాన నిర్ణేతలు అనేక పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, ప్రజాపంపిణీ వ్యవస్థలను ప్రవేశపెట్టారని, ఇవి అనేక లోపాలతో కూడుకొని ఉన్నాయి'' అని ప్రొఫెసర్ పి.ఆర్. బ్రహ్మానంద అభిప్రాయపడ్డారు. ఆర్థిక ప్రణాళికల ముఖ్య లక్ష్యం సాంఘిక న్యాయం సాధించడం. దీనికోసం ఆదాయ అసమానతలు తగ్గించాల్సిన అవసరం ఉంది. కానీ ఇప్పటికీ దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంత ఆదాయాల్లో వ్యత్యాసాలు ఎక్కువగా ఉన్నాయని ధండేకర్, రథ్ అభిప్రాయపడ్డారు. అశోక్ రుద్ర అభిప్రాయంలో ''ప్రణాళికల్లో విత్తవ్యూహం లోపించిందని, మానవాభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు లభించలేదని, అందువల్ల ప్రణాళికలు తన లక్ష్యాలను సాధించలేకపోయాయి'' అన్నారు. ఎస్.ఎల్.షెట్టి అభిప్రాయంలో... 1960వ, 70 దశకంలో భారతదేశంలో తయారైన వినియోగ వస్తువులు ధనికుల అవసరాలు తీర్చడానికే ఎక్కువగా ఉపయోగపడ్డాయి. 1980వ దశకంలో పారిశ్రామిక రంగంలో పురోగతి కనిపించినా 1990వ దశకంలో పారిశ్రామిక రంగ ప్రగతి తగ్గింది.

సామాజిక లక్ష్యాల్లో భాగంగా నెహ్రూ ప్రభుత్వ రంగంపై శ్రద్ధ చూపించారని, దీనివల్ల ఆ రంగంలో లాభదాయకత లోపించిందని అందువల్ల ప్రణాళిక లక్ష్యాలను సాధించలేకపోయామని రాంప్రసాద్ సేన్ గుప్తా అభిప్రాయపడ్డారు. సాంఘిక న్యాయం సాధించే దిశలో ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎక్కువ ఉపాధి కల్పించడం ద్వారా అవసరానికి మించి ఉద్యోగుల సంఖ్య పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. కిరిట్ పారిఖ్ అభిప్రాయంలో... కీలక రంగాలకు అవసరమైన వనరుల పంపిణీ సక్రమంగా లేకపోవడమే ప్రణాళికల వైఫల్యానికి కారణం.

ప్రణాళికల అమలుకు పటిష్టమైన వ్యూహం అవసరం. ప్రణాళిక వ్యూహాలు దీర్ఘకాలిక అభివృద్ధికి తోడ్పడాలి. ప్రణాళికల్లో ఎంచుకొన్న నిర్దిష్ట లక్ష్యాలకు అనుగుణంగా వనరుల పంపిణీ జరిపినట్లైతే ప్రణాళికల ముఖ్య లక్ష్యమైన ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. దేశంలో మానవ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకొని ఆర్థికాభివృద్ధికి కృషిచేయాలి.

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1. ప్రణాళికల్లో ప్రభుత్వ రంగ పెట్టుబడికి ఏ వనరులు ఎక్కువ దోహదపడతాయి?

ఎ) స్వదేశీ వనరులు బి) విదేశీ వనరులు

సి) లోటు బడ్జెట్ డి) పన్నులు

2. ద్వీర్వదర్శి ప్రణాళిక భావన ఏ ప్రణాళికలో ప్రారంభమైంది?

ఎ) 1 బి) 2 సి) 3 డి) 4

3. సింద్రీ ఎరువుల కర్మాగారం ఏ ప్రణాళికలో ప్రారంభమైంది?

ఎ) 1 బి) 5 సి) 7 డి) 8

4. ప్రస్తుతమున్న ప్రతి వెయ్యి జననాలకు శిశుమ రణాల రేటు 2012 నాటికి ఎంతకు తగ్గించాలని లక్ష్యం?

ఎ) 25 బి) 27 సి) 28 డి) 37

5. నిరంతర ప్రణాళిక రూపొందించిందెవరు?

ఎ) లక్డావాలా బి) అమర్త్యసేన్

సి) నెహ్రూ డి) గున్నార్ మిర్డల్

6. మానవ వనరుల అభివృద్ధి ఏ ప్రణాళిక లక్ష్యం?

ఎ) 7వ బి) 8వ సి) 9వ డి) 11వ

7. పీపుల్స్ ప్లాన్ తయారుచేసింది?

ఎ) ఎం.ఎన్. రాయ్ బి) వై.బి. చవాన్

సి) రంగరాజన్ డి) నెహ్రూ

8. 11వ ప్రణాళిక వృద్ధిలక్ష్యం?

ఎ) 8.5 శాతం బి) 9 శాతం

సి) 10 శాతం డి) 11 శాతం

9. కిందివాటిలో వేతన ఉపాధి కార్యక్రమం?

ఎ) IRDP బి) TRYSEM

సి) DWCRA డి) JRY

10. కనీస అవసరాల కార్యక్రమం ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?

ఎ) 1974 బి) 1975 సి) 1976 డి) 1977

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10
	A	C	A	C	D	B	A	B	D	A